సాక్షి మాలిక్, అజయ్ బంగా

'టైమ్ 100'లో పలువురు భారతీయులు

న్యూయార్క్, ఏప్రిల్ 17: ప్రతిష్ఠాత్మక టైమ్ మ్యాగజైన్ అత్యంత 100 మంది ప్రభావశీలుర జాబితా-2024లో మన దేశానికి చెందిన పలువురు ప్రముఖులు చోటు దక్కించుకొన్నారు. వీరిలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, బాలీవుడ్ నటి ఆలియా భట్, ఒలింపియన్ రెజ్లర్ సాక్షి మాలిక్, నటుడు దేవ్ పటేల్ తదితరులు ఉన్నారు. టైమ్ మ్యాగజైన్ బుధవారం ఈ లిస్టును విడుదల చేసింది. అజయ్ బంగా ప్రపంచ బ్యాంక్‌కు అధ్యక్షుడైన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని సాక్షి మాలిక్ సీనియర్ రెజ్లర్లతో కలిసి ధర్నా నిర్వహించి వార్తల్లో వ్యక్తిగా నిలిచారు. ఈ జాబితాలో రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ భార్య యులియా పేరు కూడా ఉన్నది.

బుల్లెట్ ట్రైన్‌లో పాము

- 17 నిమిషాలు ఆలస్యం
- జపాన్‌లో ఘటన

టోక్యో, ఏప్రిల్ 17: సమయపాలనకు మారుపేరు జపాన్‌లోని బుల్లెట్ రైళ్లు. షింకాన్‌సేన్‌గా వ్యవహరించే ఈ బుల్లెట్ ట్రైన్లు కొద్ది నిమిషాలు ఆలస్యంగా నడవడం కూడా చాలా అరుదు. అలాంటి బుల్లెట్ రైలు ఒకటి, రెండు నిమిషాలు కాదు ఏకంగా 17 నిమిషాలు ఆలస్యంగా నడిచింది. దీనంతటికీ కారణం రైలులో ఒక పాము అలజడి సృష్టించడమే! మంగళవారం నాగోయ, టోక్యో మార్గంలో వెళ్తున్న బుల్లెట్ రైలులో ఒక ప్రయాణికుడికి 17 అంగుళాల పొడవైన పాము కనిపించింది. వెంటనే అతడు సెక్యూరిటీకి సమాచారం ఇచ్చాడు. దీంతో ట్రైన్‌లోని సిబ్బంది రంగ ప్రవేశం చేసి పాము కోసం వెతికారు. ఈ గందరగోళం మధ్య రైలు 17 నిమిషాలు ఆలస్యమైంది.

పదేండ్లలో 86 రెట్లు

- ఎన్డీఏ పాలనలో ఈడీ సోదాల్లో భారీ పెరుగుదల
- ఆస్తుల స్వాధీనం, అటాచ్‌మెంట్లు కూడా..
- ఈడీ దాడుల డాటాను విశ్లేషించిన పీటీఐ
- కక్ష సాధింపునకు ఇదే నిదర్శనం: విపక్షాలు

నమోదైన పీఎంఎల్‌ఏ కేసుల సంఖ్య

ఎన్డీఏ హయాంలో	- 5,155
యూపీఏ హయాంలో	- 1,797

ఈడీ జరిపిన సోదాలు

ఎన్డీఏ హయాంలో	7,264
యూపీఏ హయాంలో	84

(సోదాల పెరుగుదల 86 రెట్లు)

స్వాధీనం చేసుకున్న ఆస్తులు

ఎన్డీఏ హయాంలో	యూపీఏ హయాంలో
1,21,618 కోట్లు	5,086.43 కోట్లు

(ఆస్తుల పెరుగుదల 25 రెట్లు)

జరిగిన అరెస్టులు

ఎన్డీఏ హయాంలో	- 755
యూపీఏ హయాంలో	- 29

(పెరుగుదల 26 రెట్లు)

స్వాధీనం చేసుకున్న అక్రమ నగదు

ఎన్డీఏ హయాంలో	2,310 కోట్లు
యూపీఏ హయాంలో	43 కోట్లు

కోర్టు అనుమతితో జప్తు చేసిన ఆస్తులు

ఎన్డీఏ హయాంలో	15,710.96 కోట్లు
యూపీఏ హయాంలో	-

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: తమపై రాజకీయంగా కక్ష సాధించడానికి, నిర్వీర్యం చేయడానికి మోదీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను విస్తృతంగా వినియోగిస్తున్నదని విపక్షాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. వారి ఆరోపణలు నిజమని నిరూపించేలా బీజేపీ పదేండ్ల పాలనలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ సోదాలు, ఆస్తుల స్వాధీనం అనూహ్యంగా పెరిగాయి. గత యూపీఏ పాలనతో పోలిస్తే బీజేపీ ప్రభుత్వ హయాంలో మనీ లాండరింగ్ చట్టం కింద ఏకంగా 86 రెట్లు అధికంగా సోదాలు, 25 రెట్లు అధికంగా ఆస్తుల అటాచ్‌మెంట్లు జరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తమను కేంద్రం టార్గెట్ చేసిందనడానికి ఈ గణాంకాలు నిదర్శనమని విపక్షాలు పేర్కొంటుండగా, అవినీతిపై చిత్తశుద్ధితో పోరాటానికి ఇవి తార్కాణమని కేంద్రం వాదిస్తున్నది.

2002 లోనే మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని(పీఎంఎల్‌ఏ) ప్రవేశపెట్టినా, 2005 జూలై 1 నుంచి దీనిని అమలు చేశారు. ఎన్డీఏ హయాంలో 2014 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు, యూపీఏ హయాంలోని 2005 జూలై నుంచి 2014 మార్చి వరకు ఈడీ జరిపిన దాడులకు సంబంధించి పీటీఐ విశ్లేషించిన డాటా ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

63 మందికి శిక్షలు

ఎన్డీఏ హయాంలో 36 కేసుల్లో 63 మందికి శిక్ష పడగా, యూపీఏ ప్రభుత్వ హయాంలో 73 చార్జిషీట్లను పరిష్కరించారు. ఈ కేసుల్లో ఎవరికీ శిక్ష పడలేదు. అదే సమయంలో పీఎంఎల్‌ఏ చట్టం కింద ఎలాంటి కేసులు పరిష్కరించలేదు. గత పదేండ్లలో విదేశాలకు పారిపోయిన నలుగురిని భారత్‌కు రప్పించారు. అయితే వ్యాపారవేత్తలు విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, సంజయ్ భండారీలు యూకేకు పారిపోయినా వారిని రప్పించడంలో మాత్రం కేంద్రం విఫలమైంది.

'డాక్సింగ్'తో గోప్యత బట్టబయలు

- మనకు తెలియకుండా మన ప్రైవేట్ సమాచారం బజారులో
- నిరోధించడానికి భారత్‌లో చట్టాలు లేవంటున్న నిపుణులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: మీ వ్యక్తిగత లేదా మీ సంస్థకు సంబంధించిన గోప్యమైన సమాచారం మీకు తెలియకుండా, మీ అనుమతి లేకుండా సామాజిక లేదా ఇతర మాధ్యమాల్లో వెల్లడైతే మీరు ఏం చేస్తారు? నేటి ఆధునిక సమాజంలో ముఖ్యంగా సెలబ్రిటీలు, సినీతారలు, రాజకీయ నేతలు, ప్రముఖ క్రీడాకారులు తరచూ ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. ఇంటర్నెట్ పరిభాషలో 'డాక్సింగ్'గా పిలిచే దీనికి అడ్డుకట్ట వేయడానికి భారత్‌లో ఎలాంటి చట్టాలు లేవు. ఒక మహిళ వ్యక్తిగత, వృత్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లోంచి తొలగించాలంటూ ఇటీవల ఢిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ సమాచారం పబ్లిక్‌గా లభ్యం అవుతున్నందున దానిని 'డాక్సింగ్'గా భావించలేమని పేర్కొంది. భారత చట్టాల్లో డాక్సింగ్‌కు నిర్వచనం లేదు. కాబట్టి దాన్ని చట్టబద్ధమైన నేరంగా పరిగణించలేమంటూ నిస్సహాయత వ్యక్తం చేసింది.

ఎలా పాల్పడతారు?

సాధారణంగా హానికరమైన ఉద్దేశంతోనే హ్యాకర్లు డాక్సింగ్‌కు పాల్పడుతుంటారు. ఇది ఏ రూపంలోనైనా ఉండవచ్చు. సంబంధిత వ్యక్తుల ఫోన్ నెంబర్లు, ఇంటి చిరునామా, ఈ-మెయిల్ చిరునామాలు వెల్లడించ వచ్చు. మీ ఐడెంటిఫికేషన్ మార్కు, మీ ప్రైవేట్ పార్టుల గురించిన సమాచారం, మీ ఫొటోలు, మీ హాబీలు, మీ బలహీనతలు, మీ ఎత్తు, మీ రంగు, మీరు వాడే దుస్తులు, ఫలానా సమయంలో మీరు ఎక్కడ ఉన్నారు, ఏం చేశారు, ఎవరితో ఉన్నారు ఇలా ఏ సమాచారానైనా పబ్లిక్ డొమైన్‌లో పెట్టి సంబంధిత వ్యక్తులను బెదిరించడం, పరువు తీయడం, గౌరవానికి భంగం కలిగించడం వంటి చర్యలకు పాల్పడవచ్చు. సాధారణంగా ఈ హ్యాకర్లు ఈ సమాచారాన్ని ఐపీ చిరునామాలు, సామాజిక మాధ్యమాల ప్రొఫైల్స్, ఫొటోలు, బ్రోకర్ల నుంచి సేకరించిన డాటా, ఫిషింగ్ ప్రచారం, ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం ద్వారా కూడా సేకరిస్తూ ఉంటారు.

అడ్డుకోలేమా?

డాక్సింగ్ బాధితులు తమ సమాచారాన్ని హ్యాకర్లు ఎలాంటి సామాజిక మాధ్యమాల్లో ఉంచారో దానిని డాక్యుమెంట్ ఎవిడెన్స్‌గా చూపుతూ పోలీసులు లేదా సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయాలి. అవసరమైతే న్యాయస్థానాలను కూడా ఆశ్రయించవచ్చు. మీ అకౌంట్‌ను లాక్ చేయాలి, మీ ఫోన్ నెంబర్లు మార్చడం మరో ప్రత్యామ్నాయం. కాగా, ఈ డాక్సింగ్‌కు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేసే సౌకర్యాన్ని ఎక్స్ కల్పించింది. మీపై అభ్యంతరకరంగా ఉన్న సమాచారం, ఇమేజ్, వీడియోలను తొలగించమని మీరు ఎక్స్‌ను కోరవచ్చు. అయితే ఇవన్నీ తాత్కాలిక చర్యలు మాత్రమే. డాక్సింగ్‌ను నేరుగా నిరోధించే చట్టాలేవీ భారత్‌లో ఇంతవరకు లేవు. అయితే వాయోరిజం, ఐటీ చట్టాల కింద హ్యాకర్లను కొంతమేరకు అడ్డుకోవచ్చు.

రక్తం రుచి మరిగిన బ్యాక్టీరియా!

గుర్తించిన అమెరికా పరిశోధకులు

వాషింగ్టన్: సాల్మొనెల్లా వంటి పలు రకాల బ్యాక్టీరియాలు మనిషి రక్తంలోని రసాయనాల రుచిని గుర్తించగలుగుతున్నాయని అమెరికాలోని వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తేల్చారు. రక్తంలోని సీరంలో ఉండే సెరైన్ అనే అమైనో యాసిడ్‌ను బ్యాక్టీరియాలు గుర్తించి, ఆకర్షితమవుతున్నాయనని వీరు జరిపిన అధ్యయనంలో గుర్తించారు. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలు 'ఈలైఫ్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. రక్తానికి సంబంధించిన అంటువ్యాధులకు కారణమయ్యే బ్యాక్టీరియా మానవ రక్తంలోని రసాయనాలను కేవలం ఒక్క నిమిషం లోపే గుర్తించి, దాంట్లోకి చేరుతున్నదని తాము గమనించినట్టు ప్రొఫెసర్ ఆర్డెన్ బేలింక్ తెలిపారు. బ్యాక్టీరియాకు రక్తంలోని రసాయనాలను గుర్తించగలిగే సామర్థ్యం ఎలా ఉందో గుర్తిస్తే భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని నియంత్రించే కొత్త ఔషధాలను అభివృద్ధి చేయవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. తద్వారా ఔషధ నిరోధకత కలిగిన వ్యాధికారకాలకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్తున్నారు.

సూర్యరశ్మే శిశువుకు ఆహారమట!

మూర్ఖ ప్రయోగంతో సొంత బిడ్డను చంపుకొన్న ఇన్‌ఫ్లుయెన్సర్

మాక్సిమ్ లైయుటీ

మాస్కో, ఏప్రిల్ 17: రష్యాకు చెందిన మాక్సిమ్ లైయుటీ అనే ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఒక నెల వయసుండే తన సొంత కొడుకుపైనే ప్రయోగాలు చేసి, అతని ప్రాణాలు తీశాడు. మనిషికి అసలు ఆహారం అవసరం లేదని, కేవలం సూర్యరశ్మితో సూపర్ మ్యాన్ సామర్థ్యం వస్తుందని తన ఫాలోవర్లను నమ్మించేందుకు.. కొడుకు తన తల్లి పాలు తాగకుండా నిరోధించి మూర్ఖంగా వ్యవహరించాడు. దీంతో ఆ చిన్నారి న్యూమోనియా, పోషకాహారలోపంతో తీవ్ర అనారోగ్యం పాలై మరణించాడు. గత ఏడాది జరిగిన ఈ ఘటనలో మాక్సిమ్‌కు స్థానిక కోర్టు తాజాగా ఎనిమిదేండ్ల జైలు శిక్ష విధించింది. భార్య ఒక్సానా మిరోనివా ప్రసవం కోసం దవాఖానకు వెళ్లేందుకు కూడా మాక్సిమ్ నిరాకరించడంతో.. ఆమె ఇంట్లోనే బిడ్డను కనాల్సి వచ్చింది. అయితే ఒక్సానా తన బిడ్డకు మాక్సిమ్‌కు తెలియకుండా పాలు పట్టించేందుకు ప్రయత్నించేదని, అయితే తన భర్త అంటే చాలా భయపడేదని ఒక్సానా బంధువులు పేర్కొన్నారు. మాక్సిమ్ మూర్ఖంగా చేపట్టిన ప్రయోగం వల్ల బిడ్డ అనారోగ్యం పాలైనప్పటికీ, దవాఖానకు తీసుకెళ్లనిచ్చే వాడు కాదని, పైగా చల్ల నీళ్లతో స్నానం చేయిస్తే.. శరీరం బలపడుతుందంటూ అందులో ముంచేవాడని మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాగా, విచారణలో మొదట తాను చేసిన తప్పును ఒప్పుకోని మాక్సిమ్.. చివరకు తన బిడ్డ మరణానికి తానే కారణమని కోర్టు ముందు ఒప్పుకొన్నాడు. సూర్యరశ్మే ఆహారం అంటూ తన పిచ్చితో బిడ్డను చంపుకొన్న అతను.. ఇప్పుడు జైల్లో మాంసం, ఇతర ఆహార పదార్థాలు తింటుండటం గమనార్హం.

దుబాయ్‌లో వర్ష బీభత్సం

వరదలో చిక్కుకున్న విమానాశ్రయం • నీట మునిగిన జనావాసాలు

న్యూఢిల్లీ: సాధారణంగా ఎర్రటి ఎండలు, పొడి వాతావరణం కనిపించే దుబాయ్ మంగళవారం భారీ వర్షాలతో అతలాకుతలం అయింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. అనూహ్యంగా వచ్చిన జల ప్రళయం వల్ల నిత్యం రద్దీగా ఉండే దుబాయ్ నగరం స్తంభించింది. దీంతో ఈ ప్రాంతంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల పట్ల మరింత ఆందోళన పెరిగింది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వైమానిక సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దుబాయ్‌కి వెళ్లవలసిన 79 విమానాలను రద్దు చేశారు.

క్లౌడ్ సీడింగే కారణమా?

ఏడాదిన్నర కాలంలో కురిసే వర్షం మంగళవారం ఒక గంటలోనే కురవడంతో దుబాయ్ నగరం, యూఏఈలోని కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ స్థాయిలో వర్షాలు కురవడానికి కారణం కొంత వరకు క్లౌడ్ సీడింగ్ (కృత్రిమ వర్షాలు) అని నిపుణులు చెప్తున్నారు. యూఏఈలో ఏటా 200 మిల్లీమీటర్ల కన్నా తక్కువ వర్షపాతం కురుస్తుంది, వేసవి కాలంలో 50 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఈ నేపథ్యంలో వర్షాల కోసం క్లౌడ్ సీడింగ్ టెక్నాలజీని ఇక్కడ తరచూ ఉపయోగిస్తారు. మంగళవారం కురిసిన వర్షాన్ని గమనించిన నిపుణులు ప్రకృతిలో సహజత్వాన్ని మార్చే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరిస్తున్నారు.

చిత్రం

డిసెంబర్‌లో 'రాబిన్‌హుడ్'

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నితిన్ స్పోర్ట్స్ బైక్ మీద కూర్చొని స్టైలిష్‌గా ఉన్నారు. ఈ సినిమాలో నితిన్ దొంగ పాత్రలో కనిపిస్తారని, . హ్యూమరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటుందని, నితిన్ క్యారెక్టర్ టీజర్‌కు మంచి స్పందన లభించిందని చిత్ర బృందం పేర్కొంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిశ్రీరామ్, సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, ఆర్ట్: రామ్ కుమార్, రచన-దర్శకత్వం: వెంకీ కుడుముల.

మహిళలకు అండగా ఆదిశక్తి

నిస్సహాయులైన మహిళలకు చేయూతనందించేందుకు ముందుకొచ్చింది అగ్ర కథానాయిక సంయుక్తమీనన్. 'ఆదిశక్తి' పేరుతో సేవా సంస్థను స్థాపిస్తున్నట్లు ప్రకటించింది. బుధవారం శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ విషయాన్ని వెల్లడించింది. ఆమె మాట్లాడుతూ 'మహిళలు ఆత్మగౌరవంతో జీవిస్తూ అన్ని రంగాల్లో రాణించాలన్నదే నా లక్ష్యం. విద్య, ఉపాధి, శిక్షణ, ఆరోగ్యం వంటి విషయాల్లో మా సంస్థ మహిళలకు అండగా నిలుస్తుంది. అన్ని వయసుల మహిళలకు చేయూతనందిస్తాం. స్త్రీలకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారిని అభివృద్ధి పథంలో నడపాలన్నదే మా సంస్థ లక్ష్యం' అని చెప్పింది. 'భీమ్లా నాయక్' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసిన ఈ మలయాళీ సోయగం బింబిసార, డెవిల్ చిత్రాల్లో తనదైన నటనతో ప్రేక్షకులకు చేరువైంది.

సామాన్యుడి ధిక్కార స్వరం

అగ్ర హీరో చియాన్ విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ పతాకాలపై కేఈ జ్ఞానవేళ్ రాజా నిర్మిస్తున్నారు. బుధవారం విక్రమ్ జన్మదినం సందర్భంగా స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో విక్రమ్ సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'చరిత్రలో జరిగిన కొన్ని యథార్థ సంఘటనల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. వ్యవస్థలోని ఆధిపత్య శక్తులపై ఓ సామాన్యుడు వినిపించే ధిక్కార స్వరం ఇది. విక్రమ్ పాత్ర చిత్రణ భిన్న కోణాల్లో సాగుతుంది. గ్లోబల్ ఆడియెన్స్‌కు రీచ్ అయ్యే సాహసోపేతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అని చెప్పారు. మాళవిక మోహనన్, పార్వతీ తిరువోతు, పశుపతి, హరికృష్ణన్, అన్బుదురై తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, దర్శకత్వం: పా.రంజిత్.

హారర్ మిస్టరీ థ్రిల్లర్ కథాంశంతో..

యువ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ నటిస్తున్న కొత్త సినిమాను శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా బుధవార ప్రకటించారు. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. 'హారర్ మిస్టరీ థ్రిల్లర్ చిత్రమిది. లైట్ వర్సెస్ డార్క్ కథాంశంతో సాగుతుంది. అబ్బురపరిచే సాంకేతిక హంగులతో తెరకెక్కించబోతున్నాం. ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతినందిస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: చిన్మయ్ సలాస్కర్, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, ప్రొడక్షన్ డిజైనర్: మనీషా ఏ దత్, నిర్మాత: సాహు గారపాటి, రచన-దర్శకత్వం: కౌశిక్ పెగళ్లపాటి.

శ్రీవిష్ణు ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

'సామజవరగమన' 'ఓం భీమ్ బుష్' చిత్రాలతో వరుస విజయాల్ని అందుకున్నారు యువ హీరో శ్రీవిష్ణు. ఆయన నటిస్తున్న తాజా సినిమా విశేషాలను శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా వెల్లడించారు. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై సందీప్ గుణ్ణం ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఓ వినూత్నమైన పాయింట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, శ్రీవిష్ణు పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని దర్శకుడు తెలిపారు. 'ఇప్పటికే ఈ సినిమా అరవైశాతం చిత్రీకరణ పూర్తిచేసుకుంది. పరిశోధనాత్మక థ్రిల్లర్ జోనర్‌లో విభిన్న కథాంశమిది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విద్యాసాగర్, సంగీతం: కాలభైరవ, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: మనీషా ఏ దత్, దర్శకత్వం: హుస్సేన్ షా కిరణ్.

నవ్వులు పంచే 'సుందరకాండ'

నారా రోహిత్ నటిస్తున్న 20వ చిత్రం 'సుందరకాండ'. వెంకటేష్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శ్రీరామ నవమి సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో నారా రోహిత్ ఓ చేతిలో మొక్క, మరో చేతిలో పుస్తకం పట్టుకొని కూల్ అండ్ క్లాస్ అవతారంలో కనిపిస్తున్నారు. 'ఇదొక రొమాంటిక్ ఎంటర్‌టైనర్. సినిమా ఆసాంతం నవ్వులు పంచుతుంది. కథానుగుణంగా మంచి టైటిల్ కుదిరింది. సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని చిత్ర బృందం పేర్కొంది. వృతి వాఘని, శ్రీదేవి విజయ్ కుమార్, నరేష్ విజయకృష్ణ, వాసుకి ఆనంద్, అభినవ్ గోమఠం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రదీప్ ఎం వర్మ, సంగీతం: లియోన్ జేమ్స్, నిర్మాతలు: సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి, రచన-దర్శకత్వం: వెంకటేష్ నిమ్మలపూడి.

కొత్త కాన్సెప్ట్‌లకే ప్రాధాన్యతనిస్తా!

'పొలిమేర-2' చిత్రంతో హీరోగా మంచి విజయాన్ని అందుకున్నారు సత్యం రాజేష్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'టెనెంట్'. వై.యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్ రెడ్డి నిర్మించారు. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం సత్యం రాజేష్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగే కథ ఇది. భార్యభర్తల మధ్య వచ్చే సమస్యల గురించి చర్చిస్తుంది. ప్రశాంతంగా సాగిపోతున్న వారి జీవితంలో అనూహ్యంగా చోటుచేసుకున్న సంఘటనలేమిటన్నదే చిత్ర ఇతివృత్తం. మర్డర్ మిస్టరీ కథ కాబట్టి ప్రతి సన్నివేశం ఉత్కంఠను పంచుతుంది' అన్నారు. ఆర్టిస్టుగా తన పరిమితులేమిటో తనకు తెలుసునని, అందుకే కొత్త కాన్సెప్ట్‌లతో సినిమాలు చేస్తున్నానని సత్యం రాజేష్ తెలిపారు. 'భారీ బడ్జెట్, మాస్ ఎలిమెంట్స్ ఉన్న సినిమాలను కోరుకోవడం లేదు. మంచి పాయింట్ ఉన్న సినిమాలు చేయాలన్నదే నా కోరిక. ఎలాంటి అంచనాలు లేని సినిమాలు చేసినప్పుడే ఒత్తిడి లేకుండా కెరీర్‌లో నిలదొక్కుకుంటాం' అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 'స్ట్రీట్ ఫైట్' చిత్రంలో మెయిన్‌లీడ్‌లో నటిస్తున్నానని, 'మిస్టర్ బచ్చన్' సినిమాలో ఫ్రెండ్ క్యారెక్టర్ చేస్తున్నానని సత్యం రాజేష్ చెప్పారు.

మధ్యతరగతి అరుంధతి

కమల్‌కామరాజు, మోనికా చౌహాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఒసేయ్ అరుంధతి'. విక్రాంత్ కుమార్ దర్శకుడు. గూడూరు ప్రణయ్ రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం ఈ సినిమాలోని టైటిల్ లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. సునీల్ కశ్యప్ స్వరాలను అందించారు. దర్శకుడు మాట్లాడుతూ 'మధ్యతరగతి ఇల్లాలు అరుంధతి కథ ఇది. ఆమె ఓసారి సత్యనారాయణ స్వామి వ్రతం చేయాలనుకుంటుంది. అప్పుడే అనుకోకుండా ఓ సమస్య వస్తుంది. దాని నుంచి తను ఎలా బయటపడిందన్నదే చిత్ర కథ. కామెడీ ప్రధానంగా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగుతుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర బృందం పేర్కొంది.

తెలంగాణ అంకాపూర్ కథ

తెలంగాణలోని అంకాపూర్ అనే గ్రామం నేపథ్య కథతో తెరకెక్కిస్తున్న చిత్రం 'టీచర్'. కలర్స్ స్వాతి, నిఖిల్ దేవాదుల, నిత్యశ్రీ, రాజేంద్రగౌడ్, సిద్ధార్థ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కలర్స్ స్వాతి టీచర్ పాత్రలో కనిపించనుంది. '90స్-ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్ ఫేమ్ ఆదిత్యహాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ మేడారం నిర్మాత. దర్శకుడు మాట్లాడుతూ 'చదువు అంతగా రాని ముగ్గురు డల్ స్టూడెంట్స్ కథ ఇది. ఓ టీచర్‌ని కలిసిన తర్వాత వారి జీవితం ఎలా మారిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. సరదా సన్నివేశాలు, అందమైన..అమాయకమైన ప్రేమ, భావోద్వేగాలతో ప్రతి ఒక్కరి హృదయాలను స్పృశిస్తుంది. ఆద్యంతం వినోదంతో మెప్పిస్తుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అజీమ్ మహమ్మద్, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, రచన-దర్శకత్వం: ఆదిత్య హసన్.